

# మగబుద్ధి

వీర. రాజు

ప్రతి మనిషికి జీవితంలో ఎంతోమంది పరిచయం అవుతూంటారు. కొన్ని పరిచయాలు గాలిలో కలిసి పోయినా మరికొన్ని జీవితాంతం తోడువస్తూనే వుంటాయి.

• • •

దాసుతో నాకు ఎలా పరిచయమైందో గుర్తు లేదుగానీ, అతనంటే నాకు మంచి అభిప్రాయముంది. అతను నాకున్న స్నేహితుల్లో ఒకడు. ఇద్దరం ఒకే స్కూల్లో చదువుకోకపోయినా, ఒకే వీధిలో వుండేవాళ్ళం. దాసుకి చాల

పిరికితనం ఎక్కువ. ప్రతి చిన్న విషయాన్ని పెద్దది చేసేసుకుని బెంబేలు పడిపోతూండేవాడు. పలకరిస్తేగానీ ఎవరితోనూ మాటలాడడు. మాట్లాడ్డం మొదలు పెడితే అవతలి వాడికి బోర్ కొట్టేసి పారిపోతారేమోగానీ, మాటలాడడం ఆపడు. అలా అని అతనేదో వాక్చాతుర్యం గలవాడు, మంచి వక్త అని అనుకోవడం పొరపాటు అతను మాటలాడేది కేవలం పనికి మాలిన సంభాషణ. ఒక మాటకి రెండో మాటకి అసలు సంబంధం వుండదు. అందుకే దాసుని తప్పుకు తిరుగుతుంటారు తెలిసిన వాళ్ళందరూ. నాకు మాత్రం దాసంటే ఒక రకమైన జాలి. ప్రతి మనిషికి ఏదో ఒక బలహీనత వుండడం సహజం. అటువంటి బలహీనత వున్నవాళ్ళని ఏదో ఒక విధంగా సరిచెయ్యడం సమాజంలోని మనందరి కర్తవ్యం అని నాకో గుడ్డి అభిప్రాయం. అందుకే దాసు ఎక్కడైనా కనబడితే నేనే ముందు అతడ్ని పలకరించే వాడ్ని. అతనికి కావసిన సలహాలు పుస్తకాలు ఇచ్చేవాడ్ని. అతనితో గంటల తరబడి మాటలాడే వాడిని. మా యిద్దరినీ చూసినోళ్ళు "వీడికికూడ పిచ్చి పట్టింది రోయ్ 'పిచ్చివాళ్ళ సంఘం' లో చేరి పోతున్నాడు" అని తెలిసిన ఫ్రెండ్సు వేళాకోళం చేస్తూండేవారు. అయి నా వాళ్ళ మాటల్ని నేను అసలు పట్టించుకునే వాడ్నికాదు. నా వుద్దేశ్యం ఏమిటంటే దాసుని సమర్థుడ్ని చేయాలని.

నేను డిగ్రీ అయిన తర్వాత, పోస్టు గ్రాడ్యుయేషన్‌కి వైజాగ్‌లో సీటు దొరకడంతో మావూరు విడిచి వెళ్ళిపోయాను. వెళ్ళేముందు రోజు దాసు నా దగ్గర కొచ్చి, "రవీ! ఇక్కడ నాకెవ్వరూ ఫ్రెండ్సులేరు. వున్న నువ్వు కూడ దూరంగా వెళ్ళిపోతున్నావు నాకు చాల బాధగా వుంది." కళ్ళనీళ్ళు పెట్టుకున్నంత పని చేసేడు. దానుకి ధైర్యం చెప్పి ఓదార్చాను. ఆ మరుసటిరోజే బయలుదేరి నేను వైజాగ్ వెళ్ళిపోయాను.

ఆ తర్వాత రెండు మూడు సంవత్సరాల వరకు గానీ, నేను మావూరు వెళ్ళడం పడలేదు. ఎందుకంటే ఆ వుళ్ళో వున్న పొలం, యిల్లు అమ్మేసి, అమ్మ-నాన్నగారు వైజాగ్ వచ్చేసేరు.

ఈ మధ్యలో దాసు గురించి తెలుసు కోవాలనిపించినా చదువులోపడి అంతగా పట్టించుకోలేకపోయాను. మొదట్లో దాసు నుంచి ఒకటి రెండు వుత్తరాలు వచ్చాయి. నేను వాటిలో ఒకదానికి జవాబు కూడ రాసేను. తరువాత ఆ వుత్తరాలు రావడం మానేసేయి.

నా చదువు పూర్తయిపోయింది. ప్రస్తుతం ఖాళీగా వున్నాను. ఎందుకో ఓసారి మా వూరెళ్ళి రావాలనిపించి బయలుదేరేను. నాకెంతో వుత్సాహంగా వుంది. చాలాకాలం తర్వాత ఆ వూరు చూడబోతున్నందుకు.

బస్సు బయలుదేరింది కానీ నా

ఆలోచనలు అప్పుడే కాకినాడ చేరి పోయాయి. ఆ ఊరిలో నేను గడిపిన అందమైన సాయంత్రాలు ఆ వూరిని రెండు భాగాలుగా చేసి మధ్యస్తంగా ప్రవహించే ఉప్పుటేరు దానిపై ఓచిన్న కాంక్రీటు వంతెన వంతెన పైనుంచిచూస్తే నీటిపై గాలికి చిన్నగా వూగుతూ కనపడే ఇంజన్ బోట్లు. చిన్నచిన్న పడవలు, ఆ వంతెన పైన నిలబడి స్నేహితులతో పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ అర్ధరాత్రివరకూ కాలం గడిపేయడం– మావూరు అనగానే ఇవి మొట్టమొదటిగా నాకు గుర్తువచ్చేవి.

నాకు వెంటనే దాసు గుర్తుకొచ్చాడు. దాసెక్కడున్నాడో ? ఏం చేస్తున్నాడో ?

యిదివరకటిలా వున్నాడో మనిషిలో ఏదైనా మార్పు వచ్చిందో ?

మాయింటి ప్రక్కనుండే మాష్టారు గారి రెండో అమ్మాయి పారిజాతం చటుక్కున జ్ఞాపకం వచ్చింది. ఎందుకంటే ఆ అమ్మాయి నా మీదెప్పుడూ ఓ కన్నేసి వుంచేది. నేనెప్పుడెదురయినా కొంటెగాచూసి నవ్వుతూండేది. ఒక్కోసారి చిలిపిగా కన్నుకొట్టేది. రిసీవ్ చేసుకోడానికి నా కప్పట్లో భయం. ఆ అమ్మాయి కనబడితే చాలు నాగుండె దడదడలాడేది. అందుకే తలవంచుకుని వెళ్ళిపోతూండే వాడ్ని ఆ అమ్మాయినిచూసి నవ్వుడల్లా.

డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో బస్సు ఒక్క కుదుపుతో ఆగిపోయింది, ఆలోచనల్లోంచి తేరుకుని కిటికీలోంచి బయటకు చూసాను అనకాపల్లి.

బస్సును ఓ పక్కగా ఆపి డ్రైవరు, కండక్టరు– ప్రయాణీకులు దిగుతున్నారు కాఫీలకు. నేనుకూడ దిగి ఎదురుగా వున్న హోటల్ కివెళ్ళి వేడివేడి టీ తాగి వక్కపొడి నములుతూవచ్చి కూర్చున్నాను. బస్సు బయలు దేరింది.

నేను చదివిన కాలేజీ వెనక అప్పలస్వామి టీ దుకాణం వుందో లేదో. వుందుంటే ఈసరికి పాకతీసి మేడేసుంటాడు. ఎప్పుడు మేం క్లాసు ఎగ్గొట్టేసినా ఆ టీ స్టాల్ లో కూర్చుని గంటల తరబడి కబుర్లు చెప్పుకుంటూండే వాళ్ళం. ఎంత రద్దీగా వున్నా అలా కబుర్లు చెప్పుకో నిచ్చేవాడు అప్పలస్వామి. అందుకే అప్పలస్వామంటే మాకందరికీ చాల యిష్టం. ఒక్కోసారి టీకి డబ్బులేక పోయినా వూరికినే తాగి పొమ్మనే వాడు.

"ఇదేం వూరు మాష్టారూ?" పక్కనున్నాయన భుజంతట్టి పిలిచేటప్పటికి ఉలిక్కిపడి ముందు ఆ ఆసామివైపు తర్వాత కిటికీలోంచి బయటకు చూసాను

'పాయకరావుపేట' అన్నాను

"పాయకరావు పేటకి తునికి చాల దగ్గరట కదండీ!" అన్నాడు. బహుశా ఆ అసామి ఆ వైపు ప్రాంతీయుడు కాదనుకుంటా.

"అవునండి రెంటికీ మధ్యనౌక

వంతెనుంది. ఇటు పాయకరావుపేట— అటు తుని— చిత్రమేమిటంటే వంతెన కిటువైపంతా విశాఖపట్టణం జిల్లాలోనికి అటువైపంతా తూర్పు గోదావరి జిల్లా లోనికి వస్తుంది" అని వివరమర్చి చెప్పాను.

ఇక మా సంభాషణంతా అలా రాజకీయాలమీదికి నేటి విద్యా విధానం మీదకి దొర్లిపోయింది ఇంక నా ఆలోచనలన్నీ తాత్కాలికంగా కట్టువడిపోయాయి.

బస్సు కాకినాడ చేరుకుంది.

బస్సు దిగి, నేను రిక్షాచేసుకుని మా పిన్నివాళ్ళింటికి వెళ్ళాను, చాలా కాలం తర్వాత చూసిన పిన్ని ఆనందపడింది.

"ఎండగా వుంది. సాయంత్రం వెళదువుగానిలే బయటికి" అంటున్న పిన్ని మాటలు లక్ష్యపెట్టకుండ స్నానం చేసి బట్టలు వేసుకుని బయలుదేరాను ఆ [illegible] నా ఆశ నిరాశే అయింది [illegible] మొహాలేవీ కనపడలేదు.

దాసు గురించి తెలుసుకోవాలనుంది. వాళ్ళింటికి వెళ్దామనుకున్నాను. కానీ వాళ్ళ[illegible] నా[illegible] పరిచయం లేదు. పైగా వాళ్ళు యిప్పుడు యిదివరకున్న యింటిలో వున్నారో? లేరో ?

ఎండ బాగా వచ్చేసింది సాయంత్రం వెళ్ళి కలుసుకుందామని యింటికి బయలు దేరివచ్చేసేను.

భోజనం చేస్తుండగా పిన్ని అంది "మాష్టారుగారమ్మాయి పారిజాతం తెలుసుకదా ?"

"రెండో అమ్మాయికదూ !" జ్ఞాపకం వున్నా, లేనట్టు అడిగాను.

"ఆఁ . ఆ అమ్మాయే" అంది.

"ఏమైంది?" ప్రశ్నించాను.

"ఎవరితోనో లేచి పోయింది. అప్పట్నుంచీ ఆ అమ్మాయిమీది బెంగతో మాష్టారు మంచంపట్టి ఈమధ్యనే కాలం చేసేరు" చిన్నగా నిట్టూరుస్తూ చెప్పింది పిన్ని.

నేనేం మాట్లాడలేదు అంతగా ఆశ్చర్యపోనూ లేదు, ఆ అమ్మాయి మాత్రం ఏం చేస్తుంది ? తండ్రీ ఎంతకీ పెళ్ళి చేయకపోతే తనదారి తను చూసుకుంది పాపం అనిపించింది.

కొన్ని క్షణాల తర్వాత అడిగాను. "పిన్నీ! దాసు వాళ్ళు ఎక్కడున్నారో నీకేమయినా తెలుసా ?"

పిన్ని రెండు క్షణాలు మౌనంగా వుండి అతర్వాత అంది "ఏం చెపుతాం? ఒక్కో మనిషికి భగవంతుడు ఒక్కో రకమైన రాత రాస్తాడు. పాపం అతని జాతక మేమిటోగానీ చిన్నప్పట్నుంచీ అలానే వుంది" నాలో ఆతృత ఎక్కువయిపోయింది" ఏమయింది ? దాసుకెమయింది ? మామూలుగా అడగాలనుకున్నా నా గొంతులో ఆతృత పొడచూపింది.

దాసు తాగుడికి అలవాటుపడిపోయాడు, ఇప్పుడతను మైకంలో లేని గంటలు చాల తక్కువ"

"షాక్" తిన్నట్టు ఫీలయ్యాను. చాల ఆశ్చర్యం వేసింది. కారణం తెలుసుకో వాలనుకున్నాను. కాని అంతలో ఎవరో పిన్నిని పిలవడంతో బయటకు వెళ్ళి పోయింది.

నాకిక భోజనం చేయబుద్దెయ్యలేదు. నా మనసు పాడయిపోయింది. చేయికడి గేసుకుని లేచిపోయాను.

సాయంత్రం బయటకెళితే వంతెన మీద చిన్నప్పటి ఫ్రెండ్ రమేష్ కను పించాడు "ఎప్పుడురా ! రాక ?" ఆనం దంగా పలుకరించాడు. చెప్పాను.

కొంచెం సేపయిన తర్వాత అడి గాను ఏమీ తెలిసీ వాడిలా-"దాసెక్క డున్నాడని?"

"ఇక్కడే వున్నాడు. ఈ పాటికి దాసు గురించి నీకు తెలిసే వుండాలే!" అదోలా నవ్వుతూ అన్నాడు.

"దాసింటికి వెళదాం వస్తావా?"

"దాసిప్పుడు యినివరకటి యింట్లో లేడు. యింట్లోవాళ్ళతో విడిపోయిన తర్వాత 'రామారావ్‌పేట'లో ఓ రూమ్ అద్దెకు తీసుకుని వుంటున్నాడు." అని అ యింటి గుర్తులు జెప్పి, దానితోపాటు ఓ 'సారీ' చెప్పి వెళ్ళిపోయాడు తనకు అర్జెంటు పనుందంటూ.

దాసుంటున్న రూమ్ సులభంగానే గుర్తు పట్టాను. వెళ్ళి తలుపు తట్టాను. లోపల్నుంచి ఎటువంటి సమాధానమూ రాలేదు. నెమ్మదిగా తలుపు తోసాను. గదంతా చీకటిగా వుంది. మంచంపై ఎవరో పడుకున్నట్టుగా లీలగా అగుపిస్తోంది.

"దాసూ!" పిలిచాను కాస్త గట్టిగానే. సమాధానం రాలేదు

రెండు మూడుసార్లు పిలిచిన తర్వాత ఆ ఆకారం కళ్ళు విప్పింది.

అతను దాసు.

కళ్ళు ఎర్రగా వున్నాయి. గడ్డం పెరిగింది. బట్టలు మాసిపోయివున్నాయి. కళ్ళు లోతుకు పోయి - మొహం పీక్కుపోయి మనిషి గుర్తుపట్ట లేనంతగా మారిపోయాడు.

గదంతా చిందర వందరగా వుంది. గదినిండా సిగరెట్టు పీకలు ఎక్కడ పడితే అక్కడ వర్షాకాలంలో ముసిరిన ఈగల్లా వున్నాయి. మూలనున్న కూజా నేలమీదికి దొర్లి పడడం వలన దాంట్లోంచి వలికిన నీళ్ళను కిందున్న బట్ట పీల్చుకుం టున్నాయ్. ఒక్కమాటలో చెప్పాలంటే దొంగలను బంధించడానికి వుపయోగించే చీకటికొట్టులా వుందాగది. క్షణంసేపు గదిని పరికించిన నా కళ్ళు తిరిగి దాసు మీదికి చేరుకున్నాయి.

"దాసూ! జబ్బు పడ్డావా?" ప్రశ్నిం చాను. ఏమీ తెలీని వాడిలా.

నన్ను చూసి జీవంలేని నవ్వు నవ్వాడు.

"ఎప్పుడొచ్చావ్?" నీరసంగా అన్నాడు.

చెప్పాను.

ఓ రెండుక్షణాలు మౌనం తర్వాత,
"నా గురించి నీకేమీ తెలీదా?"
పేలవంగా నవ్వుతూ అడిగాడు.

"తెలీవి వాళ్ళు ఏదో వాగుతుంటార్లే!" తడబడుతూ అన్నాను.

"అంతా నిజమే" అని నవ్వి, "ఈ దాసుగాడికి యింత ధైర్యం ఎలా వచ్చిందా అని ఆశ్చర్యపోతున్నావా?"

"నువు చిన్నపుడు చెబుతూండే వాడివి మనిషికి ధైర్యం చాలా అవసరం అని, అది చాలా నిజం. నేనప్పట్లో చాలా పిరికివాడ్ని. ఏ పనీ ధైర్యంగా చేయలేక పోయేవాడ్ని. ఒక చెడ్డపని చేయటానికి కూడ మనిషి కెంతో గుండె ధైర్యం కావాలి. అది అందరికీ రాదు. కొంతమందికి పుట్టుకతోనే వస్తుంది. మరి కొంతమందికి పరిస్థితులు కల్పిస్తాయి."

దాసు నిట్టూర్చాడు-తిరిగి అన్నాడు-

"నువ్వీవూరు విడిచి వెళ్ళిన తర్వాత పద్మతో నాకు పెళ్ళి అయింది. మా మావగారికి డబ్బుంది. అంతకు మించిన పొగరుంది. అయితే వాళ్ళకి నే నెలా నచ్చానో తెలీదుగానీ, వాళ్ళమ్మాయికి నన్ను చేసుకుంటామన్నారు. వాళ్ళు యిస్తామన్న కట్నంమీద ఆశతో కనీసం నన్ను సంప్రదించకుండానే సడన్‌గా ముహూర్తాలు పెట్టేసుకున్నారు. పద్మ అందం నన్ను ముగ్ధుడ్ని చేసింది. ఒక మూడునెలలనుకుంటా బాగానే గడిపాం. అక్కడ్నుంచి చిన్న చిన్న గొడవలు మొదలయ్యాయి.

మొదట్లో చాలా మట్టుకు సర్దుకుపోయాను. పద్మది చిత్రమైన మనస్తత్వం తనమాటే అందరూ ఒప్పుకుని తీరాలి అనే మొండి పట్టుదల మనిషి. ఎటువంటి విషయాన్నయినా తేలికగా తీసుకునేరకం పెళ్ళయిన కొద్ది రోజులకు పద్మ క్యారక్టర్ మంచిదికాదని ఆమెకు చాలా మంది మగవాళ్ళతో ఎన్నో రకాల స్నేహాలున్నాయని విన్నాను. జనం అనేది నిజమో కాదో నాకు తెలీదు అయితే వాళ్ళు చెప్పింది మనసుని దహిస్తోన్నా, నేను పద్మను ఏమీ అనదల్చుకోలేదు. నాకు తెలుసు నేను చిన్నతనంలో ఎటువంటి పరిస్థితుల్ని ఎదుర్కొన్నానో, అందరూ వుండి లేనివాడిగా వంటరితనం అనుభవిస్తూ జీవచ్ఛంలా బతికాను, అందుకే పెళ్ళయిన తర్వాతయినా నా వ్యక్తిత్వాన్ని పెంచుకోవాలనుకున్నాను, సాధ్యమైనంతవరకు ప్రతి విషయాన్నీ, లోతుగా ఆలోచించి గానీ ఏ నిర్ణయాని కొచ్చేవాడ్ని కాదు. దాసు సమర్థుడు అని అందరూ అనుకోవాలి. నన్ను హేళన చేసిన వాళ్ళే నన్ను పొగడాలి. అదేరా నా కోరిక" అని.

"బోర్ కొడుతున్నానా?" మధ్యలో అడిగాడు.

"లేదు అన్నాను."

"ఆ రోజు ఉగాది. ఇద్దరం గుడికి బయలుదేరాం. పద్మ గులాబీ రంగు చీరెలో అదే రంగు జాకెట్టు నుదుట అదే రంగు బొట్టు పెట్టుకుంది. తలంటు కుని వదులుగా వేసిన జడలో ఒకవైపు పెట్టుకున్న ఎర్రగులాబీ తనకు మరింత అందాన్ని చేకూర్చింది. తను నా పక్కన నడుస్తుంటే నాకు చాలా గర్వమనిపించింది. గుడి దగ్గరే కదాని నడిచి వెళ్తున్నాం. సగం దూరం వచ్చేసరికి "హలో' ఎర్రగులాబీ!" అంటూ ఓ కుర్రాడు పలకరించాడు పద్మని.

"హలో! అంటూ పద్మ నవ్వుతూ బాగున్నావా?" అంది.

"ఏం బాగులే నువు పెళ్ళి చేసుకున్న తర్వాతమమ్మల్నందర్నీ మర్చిపోయావు" ఏడుపు లాంటి నవ్వుతో అన్నాడు.

"తర్వాత కనపడతాలే స్వీటీ!" అనుకుంటూ వెళ్ళిపోయాడు.

"మ్యానర్ లెస్‌ఫెలో పక్కనెవరున్నారో కూడ తెలుసుకోకుండా ఎంత అసభ్యంగా ప్రవర్తించాడు" అని తిట్టుకున్నాను.

మౌనంగా నడుస్తున్న నన్ను, "జెలసీనా?" అంది పద్మ.

"ఎందుకు?" అన్నాను.

మీ భార్యని పలకరించే మగాడెవడో తెలుసుకోవాలని మీకు లేదా?" అని నవ్వింది.

"ఎవరతను?"

"ఫ్రెండ్. జస్ట్ ఎ బాయ్ ఫ్రెండ్"

"ఆ రాత్రి నేను పద్మతో అన్నాను. "చూడు పద్మా! ఫ్రెండ్స్ వుండడంలో తప్పులేదు. మనిషికి ఫ్రెండ్స్ వుండితీరాలి. ఒకప్పుడు స్నేహితులు లేక, వుండి కూడ పలకరింపుకు సరిగా నోచుకోక నేనెంత మనోవేదననుభవించానో నీకు తెలీదు. ఆఫ్‌కోర్స్ దానికి అప్పట్లో నా అసమర్థతే కారణం అనుకో. అయితే మంచి స్నేహితుల్ని ఎన్నుకోడం ఆ స్నేహాన్ని జీవితాంతం నిలబెట్టుకోడం అందరికీ సాధ్యపడదు."

పద్మ గోడవైపు తిరిగి పడుకుంది మౌనంగా.

నాల్గురోజులు గడిచాయి.

ఆ రోజు నేను కంపెనీ నుంచి యింటికి వచ్చి మెట్లెక్కబోతుంటే తలుపులు తీసుకుని ఓ వ్యక్తి బయట కొచ్చాడు. అతని వెనకాతనే గుమ్మంలో పద్మ. యిద్దరూ నన్ను చూసి కంగారు పడ్డారు. అతన్నెక్కడో చూసినట్టనిపించింది. తర్వాత గుర్తొచ్చింది. అతను ఆ రోజు గుడికెళ్తుంటే దారిలో పద్మని పలకరించిన మనిషి.

మౌనంగా ఇంట్లోకి నడిచిన నన్ను చూసి లేని నవ్వు పెదాలమీదికి తెచ్చుకుంటూ అడిగింది నన్ను - "ఇవాళింత పెందళాడే వచ్చేసేరే?" అని.

"ఒంట్లో బావుండలేదా?" నుదుటిమీద చేయివేస్తూ అంది.

"ఎవరతను?" అడిగాను తెచ్చిపెట్టు కున్న సహనంతో.

ఓ క్షణం పద్మ నా వైపు చూసి, "మా ఫ్రెండ్ అదే మొన్న ఆ మధ్య దారిలో కనుపించాడే — అతను. ఎంతో మామూలుగా చెప్పాలనుకుంది కానీ అమె గొంతులో ఏదో అడ్డుపడినట్టు తడబడింది.

"ఎందుకొచ్చాడు?"

ఫ్రెండ్స్ ఎందుకొస్తారు?" ఎదురు ప్రశ్న వేసింది.

తలుపులు వేసుకుని మాట్లాడుకొనేంత స్నేహమా? కోపంగా అడిగాను.

"నన్ను అనుమానిస్తున్నారా?" రెచ్చిపోయినట్టు అడిగింది.

"అనుమానించడం కాదు. ఆలోచించు కోమంటున్నాను. మీ యిద్దరి మధ్య పవిత్రమైన స్నేహభావం వుండొచ్చు. కానీ లోకం ఏమనుకుంటుందో అన్న యింగిత జ్ఞానం వుండాలి.

నా మాటలకు పద్మ "ఇప్పుడేం మునిగిపోయిందనీ యింతేసి మాటలు!" విసుగ్గా అంది.

నేను ఖచ్చితంగా చెప్పాను. "నేను లేనప్పుడు మీ ఫ్రెండ్స్ - అందునా మగవాళ్ళు రావడం నా కిష్టం లేదు."

నా మాటలకు పద్మ బాగా రెచ్చిపో యింది.

"ఎందుకు రాకూడదు? నా ఫ్రెండ్స్ నేను రమ్మంటే వస్తారు. పొమ్మంటే పోతారు. పెళ్ళయినంత మాత్రాన నా ఫ్రెండ్స్‌ని మర్చిపొమ్మంటే నావల్లకాదు నాకు ముందునుంచీ స్నేహితు లెక్కువ.

మీకు మల్లే ఒంటరి బ్రతుకు నా కలవాటు లేదు. చిన్నప్పట్నుంచీ జాలీగా గడపడం నా కలవాటు. ఒకరి గురించి నా వ్యక్తిత్వాన్ని చంపుకుని బతకలేను. నేను కూడ మీ కిదే చెప్తున్నాను. ఇక మీదట నా ఫ్రెండ్స్ విషయంలో జోక్యం కలగజేసుకో వద్దు."


పద్మకు చాల విధాల నచ్చచెప్పి చూసాను. కాని లాభం లేకపోయింది. ఫ్రెండ్స్‌తోటి విచ్చల విడిగా తిరగటం— సినిమాలు, షికార్లు ఓరోజు పద్మ ప్రవర్తన నాకు బాగా చికాకునీ, కోపాన్నీ తెప్పించాయి. ఆవేశంలో చేయిచేసుకున్నాను.

కోపంతో పద్మ పుట్టింటికి వెళ్ళి పోయింది. రెండురోజులు చూసాను తీసుకురావాలని వాళ్ళ ఇంటికి వెళ్ళాను—

నేను వెళ్ళేసరికి పద్మ యింట్లో లేదు. వాళ్ళ నాన్నెప్పుడూ బిజినెస్ వ్యవహా రాల్లో నెలకి యిరవై రోజులు దేశంపైన తిరుగుతూవుంటాడు. నన్ను చూసిన మా అత్తగారు, "రా! బాబు! కూర్చో!" అంది.

ఐదు నిమిషాలు మౌనంగా గడచిన తర్వాత అడిగాను పద్మను గురించి.

"ఎవరో ఫ్రెండ్‌తో బయటకు వెళ్ళింది" చెప్పింది.



ఓ క్షణం తర్వాత ఆమె అంది. ''చూడు బాబూ! పద్మ మాకు ఒక్కతే పిల్ల. దానిచిన్నప్పట్నుంచీ ఎంతో గారాబంగా పెంచాం. దానికి చిన్నతనంనుంచి అందరితోనూ కలిసిమెలిసి తిరగడం అలవాటు నువ్వేదో చిన్న విషయానికి అమ్మాయి మీద చేయి చేసుకున్నావట. దానికెంతో బాధపడుతుంది. ఇక మీద

అటువంటివి జరగకుండా చూసుకో కట్టుకున్నందుకు నీకు లేకపోయినా కన్న ప్రేమ మాకుంటుంది కదా! తెచ్చిపెట్టుకున్న బాధతో ఏవేవో చెప్పుకుపోతోంది నేను వినిపించుకోనట్టు వచ్చేసేను.

నాకు చాల అసహ్యమనిపించింది. "ఛీ! ఎటువంటి మనుషులు? కూతురి తప్పులు తెలుసుండి కూడ. మందలించకుండ వెనకేసుకొస్తున్నారు. ఆ రోజు నామీద నాకే చాల అసహ్యం వేసింది. నా సమస్యను ఏ విధంగా పరిష్కరించుకోవాలో నాకే అర్థంకానిపరిస్థితి ఏర్పడింది.

వారం రోజులు గడిచినా పద్మ రాలేదు నాకూ ఓర్పు నశించింది. ఏమయినా సరే, నేను వెళ్ళకూడదనుకున్నాను. "నేను చేసిన తప్పేవిటి? ఎందుకు నన్నుపీళ్ళందరూ యిలా పీక్కుతింటున్నారు!"

ఓ రోజు వుదయం ఏడు ప్రాంతంలో వస్తుకుంటా ఓ కుర్రాడొచ్చి "ఈ చీటీ పద్మక్క మీకిమ్మంది" అంటూ యిచ్చి వెళ్ళిపోయాడు దాంట్లో యిలారాసివుంది.

డియర్ దాస్,

నీలాంటి అనుమానం మనిషితోనూ, అసమర్థునితోనూ కాపురంచేయడం నాకిష్టంలేదు. అందుకే నేను నీ దగ్గరికి రాదల్చుకోలేదు. చిన్న విషయాన్ని పెద్ద రాద్ధాంతంగా చేసిన మనిషిని జీవితాంతం భరించడం నా వల్లకాదు. "డైవోర్స్" వంటివి తీసుకోకపోయినా స్నేహముగా విడిపోదాం. బై.

—పద్మ

వుత్తరం చదువుకున్న నేను స్థాణువునై పోయాను. మెదడు మొద్దుబారి నట్టయిపోయింది. అయిపోయింది. అంతా అయిపోయింది. జీవితంలో అన్నీ ఓటమిలే నాకు. అయినా చివరిసారిగా వెళ్ళి బ్రతిమిలాడాను. తన నిర్ణయం మార్చుకోమని. మార్చుకోనంది. వాళ్ళ తల్లిదండ్రులు కూడ కూతురినే సపోర్టు చేయడం నాకు మరీ ఆశ్చర్యాన్ని కలుగ జేసింది. ప్రపంచంలో అటువంటి తల్లిదండ్రులుకూడ వుంటారని ఆ రోజే తెలుసుకున్నాను.

తర్వాత రోజు తెలిసింది. పద్మ ఏదో ఇంటర్వ్యూకి వైజాగ్ వెళ్ళినట్టు అంతే ఆ తర్వాత మళ్ళీ కనబడలేదు. ఎన్నో విధాల ప్రయత్నించాను ఆమె జాడ తెలుసుకుందామని. అయినా తెలీలేదు. వైజాగ్‌లాంటి పట్టణంలో ఎక్కడని వెదకను? ఎవర్నని అడగను వాళ్ళ తల్లిదండ్రుల నడిగితే— "మాకూ తెలీదు యింట్లోంచి వెళ్ళిపోయిన తర్వాత ఒక వుత్తరం ముక్క రాసింది అంతే!" అన్నారు అసలు విషయం చెప్పడం యిష్టంలేక నాకు పెళ్ళిచేసిన తర్వాత నాకూ మా యింట్లో వాళ్ళకు సంబంధాలే లేకుండా పోయాయి.

"అది రవీ! ఈ దాసు కథ. కష్టాల్లో పుట్టి, కష్టాల్లో పెరిగి చివరికి కష్టాలనుభవిస్తూనే చచ్చిపోమ్మని రాత రాసాడేమో దేవుడు నాకు అందుకే ఈ బాధలన్నీను. ఒక్కోసారి చచ్చిపోవాలనిపిస్తూంటుంది అయినా బ్రతుకుతున్నాను ఎందుకో తెలుసా? ....నా పద్మకోసం....ఎప్పటికయినా తన తప్పు తెలుసుకుని నా

దగ్గరకొస్తుందని నా నమ్మకం. పద్మని విపరీతంగా ప్రేమించేన నేను పద్మ లేకుండా పద్మను చూడకుండ చావను.... చావలేను... కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ అన్నాడు.

నాకు చాల జాలివేసింది దాసు కథ విన్న తరువాత.

పాపం పుణ్యం తెలీని-దాసులాంటి అమాయకుల కెందుకు విధిస్తాడో దేవుడిటువంటి శిక్షలు!" అనిపించింది.

"పద్మని నువు చూడలేదు కదూ! ఫోటో చూపిస్తానుండు" అంటూ లేచి తూలుకుంటూ వెళ్ళి పెట్టె అడుగునుంచి ఒక ఫోటో తీసుకొచ్చి నా చేతికిచ్చాడు.

ఆ ఫొటో చూసిన నాకు.... భూకంపం వచ్చి భూమిలోనికి కూరుకు పోతున్నట్లనిపించింది తల దిమ్మెక్కి పోయింది. ఫోటోని పట్టుకున్నా నాచేయి వణుకుతోంది.

ఏళాది క్రితం అనుభవం మెరపులా మెరిసింది.

ఆరోజు కాలేజీ ఎగ్జిబిషన్. మేమంతా చాల హడావుడిగా వున్నాం. ఎవరి "ఐటమ్స్" దగ్గర వాళ్ళు నించుని వచ్చిన విజిటర్స్ అందరికీ క్లుప్తంగా వివరిస్తు న్నాం వచ్చిన విజిటర్స్ అందరిలోనూ ఓ అమ్మాయి నన్ను బాగా ఆకర్షించింది. చక్కని మోహం, అందమైన కళ్ళు, లేత పెదవులు, ఒత్తయిన వుంగరాల జుట్టు-చాల అందంగా వుంది. అందానికి తోడు చలాకీతనం నన్ను మరింత ముగ్ధుడ్నిచేసింది. మామూలుగా పలక రించిన ఆ పరిచయం మమ్మల్ని బాగా సన్నిహితుల్ని చేసింది. అయితే ఎంత సన్నిహితంగా నున్నా ఆమె మాత్రం తన స్వవిషయాలు చెప్పడానికిష్టపడేది కాదు. ఓ రోజు మాత్రం అంది. "మీ కభ్యంతరం లేకపోతే మీ రూమ్‌లో వుండొచ్చా ఓ వారంరోజులపాటు ! నాకు లాడ్జిలో అంతసదుపాయంగాలేదు" అంది.

అప్పటి వరకూ తెలీదు నాకు ఆమె లాడ్జిలో వుంటున్నట్టు. "దానికేం భాగ్యం మీకిష్టమైనన్ని రో జు లు ం డ ం డి" అన్నాను. అన్నదే తడవుగా సూట్ కేసు తీసుకుని బయలుదేరింది. ఏం చేయాలో తోచలేదు నాకు. మాట వరసకన్నా మాటని ఆ అమ్మాయి అంతా సీరియస్‌గా తీసుకుంటాదనుకోలేదు. ఎంత పరిచయ మున్నా అలా నా రూమ్‌కి వచ్చేస్తానం టుందేమిటి! కొంపదీసి ఆ బాపతు కాదు కదా !" అనిపించింది. అయితే ఆ అమ్మాయి చలాకీతనం, ధైర్యంగా మాట్లాడే ఆ తీరు, చూసిన తర్వాత మగాడిగా పుట్టినందుకు మొట్టమొదటి సారిగా నేను చాలా విచారించాను.

ఆమె వచ్చి వారం రోజులు దాటి పోయింది. ఆమె నామనస్సులోనూ, శరీరం లోనూ చోటు సం పా దిం చు కుం ది. యిద్దరం కలిసి బ్రతుకుతున్నాం.

"మీ వూరువెళ్ళే వుద్దేశ్యం లేనట్లుందే నీకు ?" ప్రశ్నించాను ఒకరోజు.

"నాకెవ్వరూ లేరు. నేను వంటరి దాన్ని. ప్లీజ్ నాగతం గురించి మాత్రం

అడగొద్దు. అంతకీ మీకిష్టం లేకపోతే చెప్పండి. ఎక్కడకయినా వెళ్ళిపోతాను" అంది.

నేనేం మాట్లాడలేదు.

మరుసటి రోజు నాన్నగారి దగ్గర్నుంచె టెలిగ్రాం వచ్చింది వస్తున్నట్టు ఏం చేయాలో తోచలేదు. చెప్పి ప్రతిమాలాను వెళ్ళిపొమ్మని.

"ఎక్కడికి వెళ్ళను ఇంత సడన్‌గా?" అంటూ కన్నీళ్ళు పెట్టుకుంది. నాకు మహా చికాకనిపించింది. ఈ ఝంఝాటం వదిలించుకోడం ఎలాగ అని? కావాలని కోరితెచ్చి కుంపటి నెత్తిమీద పెట్టుకున్నట్టనిపించింది.

ఎక్కడికి పోతావో పో! నాకు తెలీదంటూ విసురుగా ఆమెను బయటకు లాగి రూమ్‌తాళం వేసుకుని ఆమెవైపు కూడ చూడకుండా నేవెళ్ళిపోయాను.

సాయంత్రం రూముకి వచ్చేటప్పటికి ఆమె లేదు. ఫ్రీగా వూపిరి పీల్చుకున్నాడు. తరువాత ఆమె సంగతి మరిచిపోయాను.

"పాపం ఇప్పుడెక్కడుందో ఏమో. అసలుందో లేదో ఆత్మహత్యకానీ చేసుకోలేదుకదా! నా ఆలోచన నాకే అసహ్యమనిపించింది. ఛాఛా! అలాచేయదు. ఆమె గుండెనిబ్బరం గల మనిషి." మనసులో అనుకున్నాను.

గట్టిగా చూశాను దాసు వంక. అతను ఎక్కడో శూన్యంలోకి చూస్తున్నాడు.

దాసుకెంతో చెప్పాలనీ అతన్ని ఎన్నోవిధాల ఓదార్చాలనీ వచ్చిన నేను మూగగా అయిపోయాను.

ఏం చెప్పాలి దాసుకి?

"దాసూ! నీ జీవితం నాశనం అయిపోవడానికి కారకుల్లో నేను ఒకడ్ని. నేనూ, మీ ఆవిడ ఒకే గదిలో కొన్ని రోజులు కాపురం చేశామని చెప్పనా?"

మీ ఆవిడ గురించి బెంగపెట్టుకుని తాగుబోతు కావటానికి నాకు తెలీకుండా నేనే నీకు ద్రోహం తలపెట్టానని చెప్పనా?"

"ఏం చెప్పాలి దాసుకు?"

దాసుకేసి చూసాను. కళ్ళలో కన్నీరు. నిరాశ. అతన్ని ఓదార్చే శక్తి ఇప్పుడు నాలోలేదు వాడి జీవితాన్ని తిన్న రాబందుల్లో నేనూ ఒకడిని.

నాకేడుపొచ్చింది.

చిన్ననాటి నేస్తం . దాసుకి నేను చేసిన ఈ ద్రోహానికి నాకు శిక్ష ఏమిటి?

దాసు ఏడుస్తున్నాడు. నేనక్కడ ఉండలేక బయటకొచ్చాను. "నీ భార్య నిన్ను కాదని వెళ్ళిపోయింది. పుట్టుకతో వచ్చిన బుద్ధి పుడంతో కానీ పోదంటారు. ఏడవకురా నేస్తం ఏడవకు కన్నీరొద్దు! నిరాశ వద్దు! "అని వాడికి ఓదార్చనా?"

అడుగులు భారంగా పడుతున్నాయి.

సముద్రం ఘోష నా చెవుల్ని ఒవర గొడుతోంది